సరిగ్గా పదకొండో కిలోమీటర్ రాయి దగ్గరవుతుండగా పోలీసు పెట్రోల్ కారు సైరన్, విజిల్ వినిపించి ఉలిక్కిపడ్డారు ఆ లారీలో వున్న ఇద్దరు వ్యక్తులు. సైరన్ విజిల్ శబ్దాలు దగ్గర కాసాగాయి. ఇక తప్పదు, ప్రమాదం ముంచుకు రానున్నదని భావించిన ఆ లారీలోని వ్యక్తులు లారీని రోడ్డు దింపి, ఓచోట ఆపేసి పెట్రోల్ టిన్నులు ఓపెన్ చేసి లారీమీద విసురుగా చల్లి దూరంగా పరిగెడుతూ అగ్గిపుల్ల విసిరేశారు.

అంతే...

మంటలు భగ్గున మింటికెగశాయి. పట్టాభి, మధుమూర్తి కలల్ని చెదరకొడుతూ ఆ మంటలు గంజాయి సంచుల్ని చుట్టుముట్టాయి.

*　　　　*　　　　*

ఆ వార్త పట్టాభి, మధుమూర్తిని చేరుకుంది. ఆ ఇద్దరూ ఒక్కసారి కుప్పలా కూలిపోయారు. ఆ షాక్ నుంచి తేరుకునే ప్రయత్నంలో భాగంగానే-

ప్రస్తుతానికి వస్తే ....

ఇప్పుడు ఒళ్ళు పై తెలీకుండా మద్యపానం లో మునిగిపోయారు.

"కంపేనీ పేరుమీద అప్పులుచేసి ఆ పంటను పెంచారు. ఇప్పుడేమయింది? నాకేమిటో దిగులుగా వుంది" అన్నాడు పరమశివం బాధగా.

"అసలిదెలా జరిగింది?" పట్టాభి అనుమానంగా గొణిగాడు.

"మన ముగ్గురికి, దుర్గాదాస్‌కి, ఆ పదిమంది కూలీలకు తప్ప మరెవరికీ తెలియదు.

ఆ కూలీలు పిరికివాళ్ళు కనుక భయపడతారు. ఇక దుర్గాదాస్ మనవాడే, ఇక మిగిలింది మన ముగ్గురమే. మనమెలాగా చెప్పం. మరెలా ఇన్‌ఫర్‌మేషన్ పోలీసులకు చేరింది?" మధుమూర్తి సాలోచనగా అన్నాడు.

ఇచ్చిన మాటను ఎట్టి పరిస్థితుల్లోనూ పరమశివం తప్పడని ఆ ఇద్దరికీ గొప్ప నమ్మకం.

అందుకే వాళ్ళు పరమశివాన్ని అనుమానించలేదు.

అప్పటికి అర్ధరాత్రి దాటి రెండు గంటలయింది.

ఇక నేను వస్తానంటూ పరమశివం ఇంటిదారి పట్టాడు. ఆ ఇద్దరూ ఇంకా కసిగా త్రాగుతునే వుండిపోయారు. తండ్రి తలుపు తీసుకుని లోపలకు వస్తున్నట్లు గ్రహించాడు ఉదయ్.

అప్పటివరకూ జేబులో భద్రంగా దాచుకున్న పోలీస్ విజిల్‌ను భయంగా చొక్కా పైనించే తన గుప్పెట్లో బిగించాడు ఉదయ్.

పరమశివానికి పడుకునేముందు కొడుకు నుదుటిమీద ప్రేమగా ముద్దు పెట్టుకోవడం ఇప్పటినుంచో వస్తున్న అలవాటు. ఆ అలవాటు ప్రకారమే పరమశివం కొడుకు మంచం దగ్గరకు వచ్చి బెడ్‌లైట్ వెలుగులో కనిపిస్తున్న తన ముద్దుల కొడుకు ముఖం పైకి వంగాడు.

ఉదయ్ ఊపిరి బిగపట్టాడు తను చేసింది తప్పో-ఒప్పో తనకి తెలియదు, కాని ఒక తప్పు కాలిపోయింది. దానికి కారణం తనేనని పట్టాభి, మధుమూర్తి అంకుల్‌కి తెలిస్తే?

ఆ భయంతోటే ఉదయ్ నుదుటిమీద చెమట పట్టేసింది.

కొడుకు నుదుటిన తాకిన పరమశివం తన పెదాలకు తడిగా, ఉప్పగా తగలటంతో ఓ క్షణం ఉలిక్కిపడ్డాడు.

అదే సమయానికి ఉదయ్ కూడా ఉలిక్కిపడ్డాడు.

పరమశివం కనుబొమ్మలు ఆశ్చర్యంతో పైకి లేచాయి.

* * *

సరిగ్గా అదే సమయలో-

అక్కడ మామిడితోపులో-

"మనకింత నష్టం తెచ్చిపెట్టిన వాడెవడైనాసరే వాడ్ని ప్రాణాలతో బ్రతకనివ్వను. వేటాడి, వేటాడి వధిస్తాను" పట్టాభి కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయ్.

"అది తెలుసుకోవాలంటే ముందు పోలీస్ స్టేషన్‌లో ఒక పోలీసుని కొనేయాలి. అప్పుడే... వారికా ఇన్ ఫర్ మేషన్ అందించిన వారెవరు అయింది? ఎలా వచ్చింది? అనే వివరాలు కొంతవరకు తెలియవచ్చు".

మధుమూర్తి మెదడు అంత మత్తులోనూ చురుగ్గా పనిచేసుకుపోతోంది. కాని ఆరాత్రి పోలీస్ పెట్రోల్ కారు చెడిపోయి స్టేషన్ ముందే వున్నట్లు వారికి తెలియదు.

ఈ వ్యవస్థలో రాత్రికి రాత్రి లక్షాధికారులు కావటం ఎక్కువ వడ్డీకి ప్రలోభపడి మధ్యతరగతి మిధ్యాజీవులు మోసపోవటమూ రెండూ సర్వసాధారణమే. ఆ సత్యాన్ని దగ్గరకు రానివ్వకూడదు.

అన్యాయంగా బ్రతకగూడదనుకుంతే ఆకలికి భయపడకూడదు.

---------------------------------------------------------------------------------------------------------

ఉదయం తొమ్మిదిగంటలకే ఒక పోలీస్‌ని కొనేయటం జరిగిపోయింది.

"రాత్రి ఓ లారీ తగలబడిపోయింది" పట్టాభి నాందిప్రస్తావనగా అన్నాడు.

"అరే.... మాకింకా తెలియదే?" పోలీస్ ఆశ్చర్యపోయాడు.

పట్టాభి, మధుమూర్తి ఉలిక్కిపడ్డారు "ఆ లారీలో గంజాయి వుందనే అనుమానంతో మీ పెట్రోలుకారు వెంటాడింది".

"మా పెట్రోల్ కారు నిన్న సాయంత్రమే చెడిపోయింది, రాత్రంతా అది స్టేషన్‌ముందే వుంది".

"అబద్ధం" మధుమూర్తి గట్టిగా అన్నాడు.

" మీరు డబ్బు యిచ్చారు. నిజం కావాలన్నారు. నిజానికి విలువ ఇవ్వక పోయినా డబ్బుకు విలువ ఇస్తాను. నేను చెప్పేది నిజమే" పోలీస్ స్థిరంగా అన్నాడు.

"మరి రాత్రి ఉరు శివార్లలో మీ పోలీస్ పేట్రోల్ కారు సైరన్, మీ విజిల్స్ వినిపించాయట".

పోలీస్ నవ్వాడు.

ఆ ఇద్దరికి పిచ్చికోపం వచ్చింది.

"చిన్న పిల్లల బొమ్మలు కూడా ఆ శబ్దాల్ని సృష్టించగలవు" తేలికగా అన్నాడు పోలీస్.

"అంటే... నిజంగానే మీకు గంజాయి లారీసంగతి తెలియదా? ఏ ఇన్ ఫర్ మేషన్ మీకందలేదా? మీరు దాడి చేయలేదా?"

"లేదు.. ఇంతకి ఎవరిదా లారీ? ఎవరిదా గంజాయి? ఏమా కథ?" పోలీస్ తన సహజధోరణిలో ఆరాలోకి దిగాడు.

"మేం నీకు డబ్బులిచ్చింది మేమడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వటానికి. నువ్వు ప్రశ్నలడగటానికి కాదు."

అంటూ విసురుగా లేచి హోటల్ లోంచి బయటకొచ్చేశాడు పట్టాభి. ఆ వెనుక మధుమూర్తి కూడా వచ్చేశాడు. ఇద్దరు రోడ్డెంట నడుస్తున్నారు.

పట్టాభి ఆలోచిస్తున్నాడు. తమకెవరయినా శత్రువులున్నారా అని.

"ఏమాలోచిస్తున్నావు?" మధుమూర్తి దిగులుగా అడిగాడు.

"మనకెవరన్నా శత్రువులున్నారా అని".

మధుమూర్తికి అప్పుడు గుర్తుకొచ్చాయి పోలీసు అన్న మాటలు.

"కేవలం శత్రువులున్నారా అన్నంతవరకే ఆలోచించి లాభం లేదు. ఆ శత్రువులకు పిల్లలున్నారా అనే అనుమానం చివరివరకు ఆలోచించు."

పట్టాభి నడుస్తున్నవాడల్లా చటుక్కున ఆగిపోయాడు.

పరమశివం, అతని కొడుకు ఉదయ్‌తో అటుకేసి వస్తూ కనిపించాడు. పట్టాభి అతి ప్రమాదకరమయిన మెదడు చురుగ్గా పనిచేసుకుపోతోంది.

మరో నిమిషానికి ఈ ఇద్దరికీ ఆ ఇద్దరు దగ్గర అయ్యారు. ఒకరినొకరు కళ్ళతోనే పరామర్శించుకున్నారు.

వారికి తెలుసు వారి పలకరింపుల్లో జీవం లేదని... చిన్న పిల్లలాడుకునే టాయ్స్ ద్వారా తాము లక్షలు నష్టపోయామని పట్టాభి, మధుమూర్తి దిగులు పడుతుంటే తన కొడుకు ఉదయ్ మరో కుర్రాడితో కలసి పోలీసులు వెంటాడుతున్నారన్న భ్రమ కలిగించి గంజాయిని నాశనం చేయించాడు.

అది బయటకు తెలిస్తే.....

పట్టాభి, మధుమూర్తి తన కొడుకును చంపకుండా వదలరు. మధుమూర్తి పరమశివంతో మాట్లాడుతున్నాడు. పట్టాభి డేగచూపులు ఉదయ్ మీదకు వెళ్ళాయి.

అతని అనుమానం అతనిది.

ఎంత వెతికినా ఉదయ్ కళ్ళలో అతనికి బెరుకుగాని, భయంకాని కనిపించలేదు.

పట్టాభి ఉదయ్‌ని ఎత్తుకున్నాడు.

ముగ్గురూ నడక సాగించారు.

పట్టాభి ఉదయ్‌ని మోయటం చాలా కష్టంగా వుంది అయినా ఓపిగ్గానే భరిస్తున్నాడు ఏదన్నా క్లూ దొరకకపోతుందా అని.

కావాలనే పట్టాభి నడకలో వేగం తగ్గించి వారికి ఒకింత వెనుకబడిపోయాడు.

"బాగా చదువుతున్నావా ఉదయ్?"

పట్టాభి గొంతులోకి కృత్రిమమయిన వాత్సల్యాన్ని తెచ్చుకున్నాడు.

"ఆ... బాగానే" అన్నాడు ఉదయ్.

"నువ్వు రోజూ స్కూల్‌కెళ్తున్నావా?"

"ఓ.... రోజూ వెళ్తా"

"నిన్న కూడా వెళ్ళావా?"

"ఆ...వెళ్ళానే..."

ముందు మధుమూర్తితో నడుస్తున్న పరమశివానికి భయంగావుంది తన కొడుకెక్కడ నోరు జారతాడో అని.

"మీ నాన్న లాగా నువ్వు మంచి పనులు చేస్తుంటావా?"

"ఏం మీరు చెయ్యరా?"

చాచి లెంపకాయ కొట్టినట్లయింది అతనికి "చేస్తాం...చేస్తాం..."

ఉదయ్‌ని ట్రాప్‌లోకి ఎలా లాగాలో అర్థంకాక సతమతమయిపోతున్నాడు.

"రోజూ సాయంత్రం ఎక్కడ ఆడుకుంటారు?"

"స్కూల్ గ్రౌండ్‌లో"

"కేవలం అక్కడేనా?"

"అప్పుడప్పుడు మామిడి తోపులో"

"ఎన్నింటికి ఇంటికెళ్తావ్?"

"మా నాన్నగారింకా వాచి కొనివ్వలేదు"

అదేదో పెద్ద జోకనట్లుగా పెద్దగా నవ్వాడు పట్టాభి .

"అనవసరంగా నవ్వితే పిచ్చివాడనుకుంటారు అంకుల్".

మరలా లెంపకాయ కొట్టినట్టయింది.

"ఆ... ఏం లేదు. నువ్వు జోకేశావని నవ్వలేదు. ముద్దొచ్చి నవ్వాను".

"ముద్దొస్తే ముద్దెట్టుకు ంటారుగాని ఎవరయినా నవ్వుతారా?"

అతను ఉదయ్ చతురతకు కలవరపడ్డాడు. అతని అనుమానం మరింత బలపడింది.

"నువ్వు బొమ్మలు బాగా కొనుక్కుంటావా?"

“ఆ.. కొనుక్కుంటను”

“ఏమేం బొమ్మలు కొన్నావ్”.

“అమ్మో నే చెప్పను” ఉదయ్ భయం నటిస్తూ అన్నాడు.

అతని అనుమానం మరింత బలపడింది.